క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన రేబల ముత్తు రజనీకాంత్‌రెడ్డి జ్ఞాపకార్థం ప్రసూనాంబ ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఈఓ సాగర్‌బాబు స్వీకరించి దాతలకు కృతజ్ఞలు తెలిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆర్టీసీ బస్టాండులో గుంతల పూడ్చివేత



జేసీబీతో మట్టిని చదును చేయిస్తున్న దృశ్యం

నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురం ఆర్టీసీ బస్టాండులోని గుంతలను సర్పంచ్ సుధ పూడ్చి వేయించారు. ఏడాది క్రితం ఒక సారి మట్టి తోలారు. వర్షాకాలంలో నీరు నిలిచి గుంతలు పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచనల మేరకు స్థానిక సర్పంచ్ సుధా మళ్లీ మట్టిని తోలించి చదును చేయించారు. స్థానికులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వీనులవిందుగా గాత్ర కచేరి



పాటలను ఆలపిస్తున్న గాయకులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన గాత్ర కచేరి వీనులవిందు చేసింది. తిరుపతికి చెందిన దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో గాయకులు శిరీష, సాయి స్పందన, సుదర్శన్ పలు పాటలను ఆలపించారు. వారికి కీబోర్డుపై దేవా సహకరించారు. కళాకారులను ఏవో ఖాదర్ వలి సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు.

రేపటి నుంచి ప్రసన్న వెంకన్న పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: అప్పలాయిగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం సోమవారం సాయంత్రం అంకురార్పణ జరగనుంది. యాత్రికు లు, సిబ్బంది కారణంగా తెలియక చేసిన దోషాలతో ఆలయ పవిత్రతకు లోపం రాకుండా నివారించేందుకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. పవిత్రోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన మంగళవారం పవిత్ర ప్రతిష్ఠ, 11న పవిత్ర సమర్పణ, పవిత్ర హోమాలు చేపడతారు. చివరి రోజు 12న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన జరగనుంది.

ఇళ్ల పట్టాల పంపిణీ ఎప్పుడో..?

- వరదయ్యపాళెంలో మూడేళ్లుగా ఎదురు చూస్తున్న 450 మంది లబ్ధిదారులు
- ప్రభుత్వ భూమి లేకపోవడంతో ప్రైవేటు స్థలం కొనుగోలు చేసిన ప్రభుత్వం
- రైతులకు రూ.2 కోట్ల పరిహారం పంపిణీ పూర్తి
- పంపిణీకి నోచుకోని ఇళ్ల స్థలాలు



జగనన్నకాలనీ కోసం తలారివెట్టు సమీపంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలం

వరదయ్యపాళెం: దేవుడు కరుణించినా పూజారి కరుణించని చందాన ఉంది వరదయ్యపాళెం మండలంలో అధికారుల తీరు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. వారికి పంపిణీ చేసేందుకు భూములు కూడా కొనుగోలు చేసింది. వరదయ్యపాళెం అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. మండలంలోని వరదయ్యపాళెం, ఇందిరానగర్ పంచాయతీల్లో సొంత ఇల్లు లేని నిరుపేద వర్గాలకు చెందిన 450 కుటుంబాలు మూడేళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. మండలంలోని వరదయ్యపాళెం, ఇందిరానగర్ పంచాయతీల్లో ఇళ్ల స్థలాల కోసం అధికారులు 450 మందిని అర్హులుగా గుర్తించారు. వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసేందుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు. వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో ప్రభుత్వ భూమి లేకపోవడంతో మండల కేంద్రానికి సమీపంలోని బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని తలారివెట్టు వద్ద సర్వే నంబరు 130, 131, 135, 136, 136/2లలో గల 15.31 ఎకరాలను రైతుల నుంచి సేకరించారు. వారికి ఎకరాకు రూ.12.50 లక్షలు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆ మేరకు 2 నెలల క్రితం భూములు కోల్పోతున్న సంబంధిత రైతులకు రూ.1.91 కోట్ల పరిహారాన్ని అందజేసింది.



జగనన్న లేఅవుట్ ముఖచిత్రం

పంపిణీకి నోచుకోని పట్టాలు:

భూములిచ్చిన రైతులకు 2 నెలల క్రితమే పరిహారం అందజేసినప్పటికీ సంబంధిత భూమిని స్వాధీనం చేసుకుని పట్టాలు పంపిణీ చేయాల్సిన రెవెన్యూ అధికారులు ఆ దశగా అడుగులు వేయలేదు. ఇటీవల ముళ్ల చెట్లు తొలగించారే తప్ప జగనన్న లేఅవుట్ పనులు చేపట్టలేదు. ప్రధానంగా వీధులు, ప్లాట్ల ఏర్పాటుకు సంబంధించి హద్దు రాళ్లు నాటలేదు.

హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం

మండలంలోనే తలారివెట్టు వద్ద అతిపెద్ద లేఅవుట్‌గా ఏర్పాటవుతున్న జగనన్నకాలనీలో ఇప్పటి వరకు రోడ్ల విస్తరణ, మౌలిక వసతులు ఏర్పాటుచేయలేదు. ప్రధానంగా ఇళ్ల పట్టాల పంపిణీకి ముందే హౌసింగ్ అధికారులు లేఅవుట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాల్సి ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని అధికారులు నీరుగారుస్తున్నారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి లేఅవుట్ అభివృద్ధి చేసి త్వరితగతిన పట్టాలు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

అద్దె ఇంట్లో ఇబ్బందిపడుతున్నాం



నేను అద్దె ఇంట్లో ఉంటున్నాను. పుట్టుకతో నేను ప్రత్యేక ప్రతిభావంతురాలిని. అంతేకాక నేను ఒంటరి మహిళను. నాకు నెలసరి వచ్చే రూ.3 వేల పింఛనులో రూ.1500 అద్దెకే సరిపోతుంది. మిగిలిన రూ.1500లతో నెలంతా గడపాల్సి ఉంది. తలారివెట్టు వద్ద నాకు ఇంటి స్థలం మంజూరు చేశారని గ్రామ వలంటీర్ ద్వారా తెలుసుకున్నాను. మూడేళ్లుగా పట్టా నాకు అందలేదు. నాలాంటి వారికి అద్దె ఇల్లు పెనుభారమే.

–ఈశ్వరి, పద్మావతిపురం, ఇందిరానగర్ పంచాయతీ

త్వరలో పంపిణీ చేస్తాం:



తలారివెట్టు వద్ద ఏర్పాటుకానున్న జగనన్న లేఅవుట్ స్కెచ్ ప్రక్రియ పూర్తి చేశాం. క్షేత్రస్థాయిలో హద్దు రాళ్లు నాటాల్సి ఉంది. హౌసింగ్ అధికారులు రోడ్ల అభివృద్ధి ప్రక్రియ పూర్తి చేస్తే తక్షణమే హద్దు రాళ్లను ప్లాట్ల వారీగా నాటిస్తాం. ఇప్పటికే మాకు అందిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారులను గుర్తిస్తున్నాం.

–గౌరీశంకరరావు, తహసీల్దార్, వరదయ్యపాళెం

నియోజకవర్గ సమీక్షలో ప్రస్తావించాం



వరదయ్యపాళెంకు సంబంధించి తలారివెట్టు సమీపంలో పేదలకు పంపిణీ చేయాల్సిన పట్టాల ప్రక్రియ ఆలస్యమవుతున్న విషయమై ఇటీవల తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ప్రస్తావించాను. సమస్యను క్షుణ్ణంగా జిల్లా కలెక్టర్‌కు వివరించాను. రైతులకు పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. పట్టాల పంపిణీలో మాత్రం రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ సైతం తక్షణమే స్పందించి పట్టాలు పంపిణీ ప్రక్రియ పూర్తి చేయమన్నారు. మండల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు.

–కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే, సత్యవేడు



సంతవేలూరు వెళ్లే మార్గంలో సీఎల్ఎన్‌పల్లి కూడలి వద్ద రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు



గోవర్ధనపురం సయ్యద్ చికెన్ స్టాల్ వద్ద పేరుకుపోయిన మురుగునీరు

వరదయ్యపాళెంలో లోపించిన పారిశుద్ధ్యం

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం లోపించింది. కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దోమలు అభివృద్ధి చెందడంతో జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా గోవర్ధనపురం, విజ్ఞాన్ నగర్, డొంకవీధి, హైస్కూల్ వద్ద, వరదయ్యపాళెం హరిజనవాడలో మురుగునీరు ఎక్కువగా నిలుస్తోంది. కాలువలను శుభ్రం చేయడంతోపాటు దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గోవర్ధనపురం ప్రధాన వీధిలో కల్వర్టు వద్ద పేరుకుపోయిన మురుగునీరు

వైఎస్సార్‌సీపీతోనే ముస్లింల సంక్షేమం



ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్షుడు ఆర్ఎం రఫీవుల్లాను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు రసూల్

- ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్
- రేణిగుంట ముస్లిం విభాగం అధ్యక్షుడు రఫీవుల్లాకు సన్మానం

రేణిగుంట: దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి, ఆయన తనయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ముస్లింలకు సముచిత స్థానం దక్కిందని ముస్లిం మైనారిటీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్ అన్నారు. రేణిగుంట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన ఆర్ఎం.రఫీవుల్లా సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ముస్లిం మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఉప ముఖ్యమంత్రి పదవిని ముస్లిం మైనారిటీ వర్గానికి కేటాయించడంతో పాటు అనేక పదవులు అందించారన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సైతం పార్టీలో ముస్లింలకు పెద్దపీట వేయడంతో పాటు ఉన్నత పదవులు ఇచ్చారని కొనియాడారు. అలాగే ముస్లిం కుటుంబాల్లో వివాహాలు చేసుకునే వారికి మేనమామ సాంగ్యం కింద బీరువా, డబుల్‌కాట్ మంచం, టీవీలను అందిస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన మండల కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజాకు శ్రద్ధాంజలి ఘటించారు. పట్టణ అధ్యక్షుడు రఫీవుల్లా మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి తనపై నమ్మకం ఉంచి మైనారిటీ విభాగం పట్టణ అధ్యక్ష పదవిని కట్టబెట్టడం చాలా సంతోషకరమన్నారు. అందరినీ కలుపుకుని రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, మెస్‌బాబు, షమీవుల్లా, ఇరానీ ఖాదర్, మిథున్ షాలీ, షబ్బీర్ అహ్మద్, జిలానీ, సికిందర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ




గురుదక్షిణామూర్తి సన్నిధిలో కరికాల వలనవ్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వలవన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఈఓ సాగర్‌బాబు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మలయపెరుమాళ్ ఊరేగింపు



పిచ్చాటూరులో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయపెరుమాళ్



రామగిరిలో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి



పిచ్చాటూరు ఆలయంలో ప్రత్యేక అలంకారంలో మలయపెరుమాళ్

పిచ్చాటూరు: పురటాశి నెల మూడో శనివారాన్ని పురస్కరించుకొని పట్టణంలో మయలపెరుమాళ్ ఊరేగింపు శనివారం రాత్రి అత్యంత వైభవంగా సాగింది. ఊరేగింపుగా వచ్చిన స్వామి, అమ్మవార్లకు ప్రజలు కొబ్బరికాయలు కొట్టి కర్పూరహారతులతో నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా మూలవిరాట్ అయిన శ్రీవారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. వెంకన్నను దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం పలికారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయ పెరుమాళ్ ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌పై ఉంచి ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య శ్రీవారి ఊరేగింపు ఘనంగా సాగింది. అలాగే మండలంలోని అడవికండ్రిగ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం గోవిందమాల ధరించిన భక్తులు కాలినడకన తిరుమల బయలుదేరి వెళ్లారు.

త్రైత సిద్ధాంతంతో ఆధ్యాత్మికత పెంపు



సీఐ సురేష్‌కు భగవద్గీత పుస్తకాన్ని అందజేస్తున్న కమిటీ అధ్యక్షుడు సురమౌళి

నగరి : ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించడానికే త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రచారం చేస్తున్నట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక తెలిపారు. ఆదివారం వారు భగవద్గీత పుస్తకాలను నగరి సీఐ సురేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు త్రైత సిద్ధాంతం భగవద్గీత గురించి ప్రచారం చేస్తున్నట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ, బంగారుపాళ్యం కమిటీ, వి.కోట కమిటీ అధ్యక్షుడు డి.సురమౌళి, డి.బాలాజీ, కే.అశోక్ బాబు తెలిపారు. నియోజవర్గంలో నిర్వహించే కార్యక్రమాల వివరాలను వారు తెలియజేశారు. ప్రచారానికి సంబంధించిన సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. భగవద్గీత ప్రచారం కోసం దాదాపు 300 మంది భక్తులు వస్తారని, ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామాల్లో ప్రచారం చేస్తామన్నారు.

భగవద్గీత ప్రవచనాలు ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మగుడి కల్యాణ మండపంలో శుకబ్రహ్మాశ్రమ ఆధ్వర్యంలో భగవద్గీతలోని రాజవిద్య, రాజగుణయోగం అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం ప్రారంభించారు. ఆశ్రమ పీఠాధిపతులు విద్యాస్వరూపానందగిరిస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆశ్రమ స్వామీజీ స్వాత్మానందగిరిస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో స్థానికులు జనార్దన్‌రావు, గరికపాటి రమేష్‌బాబు, న్యాయవాది రాజేశ్వరరావు పాల్గొన్నారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న స్వాత్మానందగిరిస్వామి

సంక్షేమ ప్రదాత సీఎం జగనన్న

- అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రంలో కొత్త ఒరవడి
- ఇవి కొనసాగాలంటే మళ్లీ జగనన్నే రావాలి
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు: రాష్ట్ర పురోగతికి అహర్నిశలు కృషి చేయడంతో పాటు పేదలు బాగుండాలని సంక్షేమ ఫలాలు అందించి ప్రజల మనసుల్లో మనసున్న మారాజుగా సీఎం జగనన్న ఆదరాభిమానాలు పొందుతున్నారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండారుపల్లి సచివాలయ పరిధిలోని మన్నసముద్రం, ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు నుంచి రాత్రి 9 గంటల వరకు ఎమ్మెల్యే, తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు క్రేన్ ద్వారా ఎమ్మెల్యే, ఎంపీని గజమాలతో సత్కరించి పూలవర్షం కురిపించారు. ప్రతి ఇంటి వద్ద ఎమ్మెల్యే, ఎంపీకి గ్రామస్తులు పూలమాలలు, శాలువలతో సన్మానించి మంగళహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లోని 350 కుటుంబాలను కలిశారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. మన్నసముద్రం, ఎస్టీ, ఎస్సీ కాలనీలో ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, మురుగునీటి కాలువల నిర్మాణాలు తదితర పరిష్కరించాలని ఎమ్మెల్యే, ఎంపీకి గ్రామస్తులు నివేదించారు. సమస్యలను పరిష్కరించాలని వారు సంబంధిత అధికారులను ఆదేశించారు. నాలుగన్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తికి క్రేన్‌తో గజమాల వేస్తున్న నాయకులు

ప్రభుత్వం అంటే పేదల సంక్షేమం..

ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం విషయంలో సీఎం జగనన్న దేశానికే ఆదర్శమయ్యారని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అంటే పేదలకు ప్రాధాన్యం ఇవ్వడమని, పేదవాడికి అండగా ఉంటేనే నిజమైన అభివృద్ధి సాధిస్తారనే సిద్ధాంతాన్ని జగనన్న నమ్మారని చెప్పారు. అందుకే వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్న వస్తేనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతాయని తెలిపారు.

ప్రజల సంతోషమే ముఖ్యం..

ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే ముఖ్యమంత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెట్టి ఎమ్మెల్యేలు, ఎంపీలను మీ వద్దకు పంపుతున్నారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి అన్నారు. ప్రజాసంక్షేమ పథకాలను సక్రమంగా అందించాలనే ఉద్దేశంతో జగనన్న గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి వలంటీర్ల ద్వారా పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నందునే గ్రామాల్లో తిరుగుతుంటే ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతూ ఆదరిస్తున్నారని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ఇంకా ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారున్నారా ? క్షేత్రస్థాయిలో ఇంకా ఏవైనా సమస్యలు ఎన్నాయో గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దేశవ్యాప్తంగా 5 లక్షల కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా సంక్షేమ పథకాల ద్వారా మెరుగైన స్థితికి తెచ్చిన ఘనత ఏపీ రాష్ట్రప్రభుత్వానిది అని కేంద్రం గుర్తించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, సర్పంచ్ వనజ, వైస్ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు తాళ్లపాక నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లోకనాథ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గూడల నాగవేణి, మాధవయ్య, సురేష్, మునికృష్ణారెడ్డి, మునిరత్నంరెడ్డి, తులసీరాం, శంకర్, గిరి, గురునాథం, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



పంగూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఎంపీ



ఎమ్మెల్యే, ఎంపీకి హారతులు ఇస్తున్న గ్రామస్తులు